క్లుప్తంగా

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా గీత

చాట్రాయి: రీ సర్వే డెప్యూటీ తహసీల్దార్ గీతను చాట్రాయి మండలానికి ఇన్‌చార్జి తహసీల్దార్‌గా సోమవారం నియమించారు. గతంలో తహసీల్దార్‌గా పనిచేసిన డి.ప్రశాంతిపై అవినీతి ఆరోపణలు రుజువుకావడంతో ఆమెను కలెక్టర్ వెట్రిసెల్వి సస్పెండ్ చేశారు.

హుండీ కానుకల లెక్కింపు



తిరువూరు: స్థానిక మూడు దేవాలయాల్లోని హుండీల్లో భక్తులు వేసిన కానుకల ఆదాయాన్ని సోమవారం దేవదాయశాఖ అధికారులు లెక్కించారు. ఐదు నెలలకు గాను శ్రీవేంకటాచలస్వామి ఆలయ హుండీల ద్వారా రూ.2 లక్షల 96 వేల 812, శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానంలో రూ.96,243, శ్రీ చంద్ర మౌళీశ్వరాలయంలో రూ.లక్షా 76 వేల 696 కానుకలు భక్తులు వేసినట్లు గ్రూపు దేవాలయాల మేనేజరు ప్రసాద్ తెలిపారు. హుండీ లెక్కింపులో ఆలయ అర్చకుడు వేణుగోపాలాచార్యులు, రమణమూర్తి, రాధాకృష్ణశాస్త్రి, భక్తులు పాల్గొన్నారు.

రాంగ్ రూట్‌లో వచ్చిన వాహనదారులకు కౌన్సెలింగ్



జూపూడి(ఇబ్రహీంపట్నం): జూపూడి నిమ్రా కళాశాల సమీపంలో 65వ నంబర్ జాతీయ రహదారి మధ్య డివైడర్ వద్ద రాంగ్‌రూట్‌లో ప్రయాణాలు సాగిస్తున్న వాహనదారులకు ట్రాఫిక్ ఎస్సై లక్ష్మణరావు సోమవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇటీవల కాలంలో నిమ్రా వైద్య కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు స్కూటీపై రాంగ్‌రూట్‌లో వెళుతూ కారు ప్రమాదానికి గురయ్యారు. ఇద్దరు మెడికల్ స్టూడెంట్‌లలో ఒకరు మృతి చెందగా మరొకరు ప్రాణాపాయం నుంచి బయటపడి గాయాల పాలయ్యారు. ఆప్రాంతంలో నోఎంట్రీ బోర్డులు ఏర్పాటు చేసినప్పటికీ కార్లు, బైక్‌లు, ఆటో డ్రైవర్లు ప్రమాదాల భారిన పడుతున్నారని ఎస్సై తెలిపారు. రాంగ్‌రూట్ వాహనదారులకు తొలివిడతగా కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. మరోసారి పట్టుబడితే నూతన రవాణ చట్టం మేరకు భారీగా జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

చలివేంద్రం ప్రారంభం



తిరువూరు: వాసవీ క్లబ్ సేవా కార్యక్రమాల్లో భాగంగా తిరువూరు మధిర రోడ్డులో సోమవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. క్లబ్ జిల్లా ఇన్‌చార్జి జూలూరు వెంకట రమణయ్య ఈ చలివేంద్రాన్ని ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహార్తి తీర్చడానికి తిరువూరు పట్టణంలోని పలు కూడళ్లలో తాగు నీరు, మజ్జిగ చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు క్లబ్ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు నాళ్లా రామారావు, కూన పవన్‌కుమార్, సముద్రాల కిరణ్, సూర్య ప్రకాశరావు, పరిశె మల్లికార్జునరావు, గ్రంధిశిరి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పని ఒత్తిడి తగ్గించాలని వినతి



తిరువూరు: తమపై పనిభారం తగ్గించాలని గంపలగూడెం మండల పంచాయతీ కార్యదర్శులు సోమవారం తిరువూరు ఎంపీడీవో టీవీఎస్ నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. తమ పనిసమయం 8 గంటలకు కాగా రోజుకు 14 గంటలు పనిచేసినా అప్పగించిన సర్వేలు పూర్తి కావట్లేదని, ఎప్పుడు ఏ సర్వే చేయాల్సి వస్తుందో అర్థం కావట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుటుంబాలకు దూరంగా ఉండటం వలన మానసిక ఒత్తిడికి గురవుతున్నామని, పనిభారం తగ్గించాలని కోరారు.

సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థిని ప్రతిభ



ఆగిరిపల్లి: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో శోభనాపురం మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని షేక్ నజీర చేసిన సైన్స్ ప్రదర్శనకు జిల్లా స్థాయిలో రెండో బహుమతి లభించింది. ఈ సందర్భంగా విద్యార్థినికి సహకారం అందించిన సైన్స్ ఉపాధ్యాయురాలు సుధారాణి, విద్యార్థిని నజీరాలను ప్రధానోపాధ్యాయురాలు యామిని కృష్ణప్రియ, ఉపాధ్యాయులు అభినందించారు.

నిధులు ఫుల్.. పనులు నిల్

- ఎంఎన్‌కే రహదారిలో కుమ్మరకుంట్ల వద్ద వాగుపై ఏడు కానాల వంతెన శిథిలం
- వంతెన పునర్ నిర్మాణానికి రూ.34 కోట్లు మంజూరు
- కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో ప్రారంభం కాని పనులు
- రెండు రాష్ట్రాలను, 40 గ్రామాలను కలిపే ప్రధాన రహదారి ఇది
- పట్టించుకోని అధికారులు



ఏకొండూరు మండలం కుమ్మరకుంట్ల వద్ద ఎంఎన్‌కే రోడ్డులో వాగుపై కూలిపోయిన ఏడు కానాల వంతెన

తిరువూరు: రెండేళ్ల క్రితం వరదలకు కొట్టుకుపోయిన ఏకొండూరు మండలం కుమ్మరకుంట్ల వద్ద వాగుపై పురాతన ఏడు కానాల వంతెన పునర్నిర్మాణానికి నోచట్లేదు. మచిలీపట్నం- నూజివీడు- కల్లూరు (ఎంఎన్‌కే రహదారి) అంతర్రాష్ట్ర రహదారిలో విస్సన్నపేట, ఏకొండూరు మండలాల నడుమ ఉన్న ఈ వంతెన మీదుగా నిత్యం వందలాది వాహనాలు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం తదితర జిల్లాలకు రాకపోకలు సాగిస్తుంటాయి. తెలంగాణ రాష్ట్రం నుంచి మచిలీపట్నం, గుడివాడ, ఏలూరు తదితర పట్టణాలకు ఈ రహదారి మీదుగానే భారీవాహనాలు వెళుతుంటాయి.

నిధులు మంజూరైనా..

నేషనల్ డెవలప్‌మెంట్ బ్యాంకు ద్వారా మంజూరైన నిధులతో కుమ్మరకుంట్ల సమీపంలో వంతెన పునర్నిర్మాణ పనులు చేపట్టడానికి ఆర్ అండ్ బీ అధికారులకు గతేడాది అనుమతి లభించింది. పాలనాపరమైన, సాంకేతిక ఆమోదం లభించిన తదుపరి ఈ వంతెన పనులు చేపట్టేందుకు కాంట్రాక్టరు ముందుకు రాకపోవడంతో ఇంతవరకు అతీగతీ లేదు. రూ.34 కోట్లను ఈ వంతెన నిర్మాణానికి మంజూరు చేయగా, పనులు ప్రారంభించని కారణంగా నిధులు ఇతర పనులకు మళ్లించినట్లు తెలిసింది.

వాహనచోదకుల అవస్థలు

వరదల కారణంగా పడిపోయిన పాత వంతెనకు పక్కనే ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డులో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇరుకైన రహదారిలో ఎదురెదురుగా వాహనాలు వెళ్లే అవకాశం కూడా ఉండట్లేదు. రాత్రివేళల్లో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నందున వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు కోరుతున్నారు.

ఉన్నతాధికారికి నివేదించాం..

ఎన్‌డీబీ మంజూరు చేసిన నిధులతో ఎంఎన్‌కే రహదారిపై కుమ్మరికుంట్ల వద్ద వంతెన నిర్మాణానికి అనుమతి లభించింది. కాంట్రాక్టరు పనులు చేపట్టవలసి ఉంది. ఇంజినీర్ ఇన్ చీఫ్‌కు ఈ వంతెన పనులు ప్రారంభించకపోవడంపై నివేదిక పంపించాం. వారి ఆదేశాలనుబట్టి ముందుకు పోతాం. మళ్లీ అంచనాలు రూపొందించాల్సి ఉంటుంది.

– రాజకుమారి, డీఈఈ, ఆర్ అండ్ బీ, తిరువూరు

వంతెన పునర్ నిర్మించాలి..



రెండు రాష్ట్రాల నడుమ వాహనాల రాకపోకలకు కీలకమైన ఎంఎన్‌కే రహదారిలో వంతెన కూలిపోయి ఏళ్లు గడుస్తున్నా అధికారులు స్పందించకపోవడం విచారకరం. నిధులు మంజూరైనందున నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో కూలిపోయిన వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మించాలి.

– త్యాగరాజు, విస్సన్నపేట

ఏళ్ల తరబడి నిర్లక్ష్యం..



40 గ్రామాలను, రెండు రాష్ట్రాలను కలిపే ప్రధాన రహదారిపై వంతెన కూలిపోయి ఏళ్లు గడుస్తున్నా ఆర్ అండ్ బీ అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయం. ఎంఎన్‌కే రహదారిపై కుమ్మరకుంట్ల వద్ద కూలిపోయిన బ్రిటిష్ కాలం నాటి పురాతన వంతెన స్థానంలో కొత్త వంతన వెంటనే నిర్మాణం చేపట్టి వాహనచోదకుల ఇబ్బందులు నివారించాలి.

– చిలుకూరి వెంకటేశ్వర్లు, తిరువూరు

'నవోదయం' కళాజాత

విస్సన్నపేట: నవోదయం కార్యక్రమం ద్వారా సారాతో కలిగే అనర్థాలను వివరిస్తూ విస్సన్నపేట మండలం వేమిరెడ్డిపల్లి తండాలో సోమవారం బుర్రకథ దళం కళాజాత ప్రదర్శన నిర్వహించింది. సారా ఉధృతిపై 'సాక్షి'లో వరుస కథనాలు రావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తిరువూరు సర్కిల్ ఎక్సైజ్ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. సారా బట్టీలపై దాడులు చేసి బెల్లపు ఊట ధ్వంసం చేయడం, సారా స్వాధీనం చేసుకోవడం, పాత నేరస్తులను అదుపులోకి తీసు కుని బైండోవర్ చేస్తున్నారు. సారా తాగడం వలన కలిగే అనర్థాలపై కూడా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నవోదయం కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. విస్సన్నపేట, ఏకొండూరు, గంపలగూడెం మండలాల్లో అవగాహన ప్రదర్శనలు జరిపిన అధికారులు ఇప్పుడు కళాజాతాల ద్వారా సులభరీతిలో గిరిజనులకు సారా తాగితే వచ్చే సమస్యలను వివరించే ప్రయత్నం చేస్తున్నారు. తిరువూరు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ కృష్ణవేణి, సిబ్బంది పర్యవేక్షించారు.

పే రివిజన్ కమిషన్‌ను ప్రకటించాలి

విస్సన్నపేట: రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు, రిటైర్డు ఉద్యోగుల వేతన సవరణ కమిషన్‌ను వెంటనే ప్రకటించాలని రిటైర్డు ఉద్యోగుల సంఘ విస్సన్నపేట యూనిట్ అధ్యక్షుడు నల్లంటి సూరిరాజు కోరారు. సోమవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట రిటైర్డు ఉద్యోగులు ఆందోళన చేసిన సందర్భంగా సూరిరాజు మాట్లాడుతూ గత పీఆర్‌సీలో తగ్గించిన అదనపు క్వాంటమ్‌ను పూర్వపద్ధతిలోనే ఇవ్వాలని కోరారు. హెల్త్ కార్డుపై వైద్యం చేసేందుకు ఆసుపత్రులు అంగీకరించట్లేదని, మెడికల్ ఫీజు రీయింబర్స్‌మెంటు చేయించుకోవాలని చెబుతున్నారని పేర్కొన్నారు. ఈహెచ్ఎస్ కార్డుపై నగదు రహిత వైద్యం అందించాలని తహసీల్దారు కే లక్ష్మీకల్యాణికి వినతిపత్రం సమర్పించారు. ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి కంకట మోహన్‌రావు, కోశాధికారి జేటీ రాజేంద్రప్రసాద్, కార్యవర్గ సభ్యులు ధనరాజు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 20 అర్జీలు



నూజివీడులో అర్జీలు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ స్మరణ్‌రాజ్

నూజివీడు: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని, ఈ కార్యక్రమంపై ప్రజల్లో నమ్మకం పెంచాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. మొత్తం 20 అర్జీలు రాగా వాటిని సంబంధిత అధికారులకు పరిష్కారం నిమిత్తం పంపారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ వెంకటరత్నం, డీఎల్పీఓ సుందరి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చిలుకూరి భాస్కరరెడ్డి, హెచ్‌ఓ ఆర్.హేమ తదితరులు పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని..

- చింతలపూడి మండలం సుప్రీం పేటలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలం, సింగరాజు చెరువును సంరక్షించాలని ఐదు నెలల క్రితం తహసీల్దార్ కార్యాలయంలో అర్జీని అందజేసినా నేటికీ పట్టించుకోలేదు. ఈ సమస్యను పరిష్కరించాలని తాడిగడప మాణిక్యాలరావు కోరారు.
- ముసునూరు మండలం రమణక్కపేటలో సాయల శ్రీనివాసరావు ఇంటిని అద్దెకు తీసుకొని నివాస గృహాల మధ్య మద్యం బెల్టుషాపును ఏర్పాటు చేశారు. దీనివల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. వెంటనే షాపును తొలగించాలని కోరారు.
- ఆగిరిపల్లి మండలం వడ్లమాను పంచాయతీ పరిధిలోని తెల్లవాగును ఆగిరిపల్లికి చెందిన యండూరు ప్రణీత్ అనే వ్యక్తి దౌర్జన్యంగా ఆక్రమించాడని, ఆక్రమణలను తొలగించాలని పలువురు రైతులు అర్జీ అందజేశారు.

బాలికల రక్షణ ప్రథమ కర్తవ్యం

ఏసీపీ ప్రసాదరావు



పోలీస్ స్టేషన్‌లో శక్తి టీమ్‌లను ప్రారంభిస్తున్న ఏసీపీ ప్రసాదరావు, పక్కన సీఐ, ఎస్సై

మైలవరం: బాలికల రక్షణ ప్రథమ కర్తవ్యం అని మైలవరం ఏసీపీ వై.ప్రసాదరావు తెలిపారు. మైలవరం నారాయణ స్కూల్‌లో చిన్నారుల భద్రతను కపాడే ఉద్దేశంతో మైలవరం డివిజన్‌లో శక్తి టీమ్‌లను సోమవారం ఏసీపీ ప్రసాదరావు ఏర్పాటు చేశారు. బాలికలు తమను తాము రక్షించుకునే విధంగా శిక్షణ తరగతులను నారాయణ స్కూల్ ఏజీఎం హరీష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది. మైలవరం సీఐ దాడి చంద్రశేఖర్ మాట్లాడుతూ శక్తి టీమ్‌ల సభ్యులు మఫ్టీలో విధులు నిర్వహిస్తూ మహిళలు, చిన్నారుల సమస్యలను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉంటారన్నారు. బస్టాండ్‌లు, ముఖ్య కూడళ్లలో నిఘా పెంచి మహిళలపై జరిగే వేధింపులు అరికడతాయన్నారు. సీఐ దాడి చంద్రశేఖర్, నారాయణ ప్రిన్సిపాల్ రత్నకుమారి పర్యవేక్షణలో బాలికలకు అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడేలా యాప్‌లు ఏ విధంగా సహాయాన్ని అందిస్తాయో వివరించారు. ఎస్ఓఎస్ కాల్ ద్వారా ఏ సమయంలో అయినా సహాయాన్ని పొందవచ్చన్నారు. శక్తి టీమ్ లు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని తగిన చర్యలు తీసుకుంటాయన్నారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు ప్రారంభం

- తొలిరోజు పరీక్షకు 70 మంది గైర్హాజరు
- నూజివీడు నియోజకవర్గంలో 3,387 మంది హాజరు



నూజివీడు సెయింట్ ఆన్స్ హైస్కూల్ పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న 'పది' విద్యార్థులు



మైలవరం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పరీక్ష రూములను చూసుకుంటున్న విద్యార్థులు

నూజివీడు: నియోజకవర్గ పరిధిలోని 18 పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు తెలుగు పరీక్షకు 3,457 మందికి గాను 3,387 మంది హాజరుకాగా 70 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభమైనప్పటికీ 8.30 గంటల నుంచే పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించారు. వేసవి దృష్ట్యా పరీక్షల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేశారు. తాగునీటి వసతిని, ప్రతి రూంలో బెంచీలను, గదుల్లో ఫ్యాన్లు సైతం ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్‌లు పలు పరీక్ష కేంద్రాలను సందర్శించి పరీక్షల నిర్వహణను తనిఖీ చేశారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద పోలీస్ సిబ్బందిని, వైద్య సిబ్బందిని నియమించారు. నూజివీడు పట్టణం, నూజివీడు మండలంలో కలిపి 10 పరీక్ష కేంద్రాల్లో 1,850 మందికి గాను 39 మంది గైర్హాజరుకాగా 1,811 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఆగిరిపల్లి మండలంలోని 3 పరీక్ష కేంద్రాల్లో 9 మంది గైర్హాజరుకాగా 566 మంది హాజరయ్యారు. చాట్రాయి మండలంలోని 2 పరీక్షా కేంద్రాల్లో 10 మంది గైర్హాజరు కాగా 428 మంది, ముసునూరు మండలంలోని 3 పరీక్ష కేంద్రాల్లో 12 మంది గైర్హాజరు కాగా 582 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను విధించారు. ఏఎన్ఎంలను నియమించారు.

మైలవరం: మైలవరంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. మైలవరం ఎస్వీఆర్ఎన్నార్ బాలుర హైస్కూల్‌లో 235 మంది, ఎంబీఎం బాలికల ఉన్నత పాఠశాలలో 240 మంది, ఎల్‌హెచ్‌ఆర్ ప్రభుత్వ హై స్కూల్‌లో 238 మంది వివేకానంద హై స్కూల్‌లో 240 మంది, ఎస్ఎస్‌కే స్కూల్‌లో 235 మంది, చిలుకూరువారిగూడెం ప్రభుత్వ హైస్కూల్‌లో 240 మంది, మొత్తం 1,428 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉంది. తొలి రోజు తెలుగు పరీక్షకు 1,077 మందికి గాను 1,054 మంది హాజరు కాగా 23 మంది గైర్హాజరైనట్లు ఎంఈఓ తెలిపారు. ఓపెన్ టెన్త్ క్లాస్ ఎగ్జామినేషన్‌కు సంబంధించి 208 మంది విద్యార్థులకు మూడు సెంటర్‌లు ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ ఎల్.బాలు తెలిపారు.

11 మంది గైర్హాజరు

తిరువూరు: తిరువూరులో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఆరు రెగ్యులర్ పరీక్ష కేంద్రాల్లో మొత్తం 926 మంది విద్యార్థులు పరీక్ష రాయవలసి ఉండగా, 915 మంది హాజరయ్యారు. 11 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు జరిగే ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జెడ్పీ బాలికోన్నత పాఠశాల, శ్రీచైతన్య, నారాయణ, శ్రీనిధి, భాష్యం పాఠశాలల వద్ద ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు కల్పించారు.

గంపలగూడెం మండలంలో..

తిరువూరు: గంపలగూడెం మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఊటుకూరు సిద్ధార్థ విద్యాలయంలో 148 మందికి గాను 145 మంది, ఊటుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 135 మందికి 134, గంపలగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 170కి 165, తోటమూల సరస్వతీవిద్యాలయంలో 194కి 191, గీతాంజలి స్కూల్లో 140కి 136 మంది పరీక్షలకు హాజరైనట్లు ఎంఈవో నరసింహారావు తెలిపారు. మండలంలో మొదటి రోజు మొత్తం 787 మందికి గాను 771 మంది హాజరైనట్లు తెలిపారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: పదోతరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభం అయ్యాయి. మండలం పరిధిలో ఎనిమిది పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలకు మొత్తం 1,464 మంది విద్యార్థులు హాజరుకావల్సి ఉండగా 1,454మంది హాజరైయ్యారు. 10 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరు అయినట్లు ఎంఈవో సీహెచ్ పుష్పలత, ఎంఈవో- 2 రత్నశ్యామ్ బాబు తెలిపారు. విద్యార్థుల ప్రయోజనార్థం వైద్యశిబిరం, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి ప్రశాంతంగా పరీక్షలు జరిగేలా చర్యలు తీసుకున్నట్లు వారు వెల్లడించారు.

జి.కొండూరు: పదో తరగతి మొదటిరోజు పరీక్షకు మండల పరిధిలోని నాలుగు పరీక్ష కేంద్రాలకు 654 మంది విద్యార్థులు హాజరవ్వాల్సి ఉండగా 648 మంది హాజరైనట్లు ఎంఈఓ వీరాస్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టినట్లు వివరించారు.

రెడ్డిగూడెంలో 405 మంది హాజరు

జి.కొండూరు: మండల పరిధిలో 416 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరవ్వాల్సి ఉండగా మొదటి రోజు పరీక్షకు నాలుగు పరీక్ష కేంద్రాలలో కలిపి 405 మంది హాజరైనట్లు ఎంఈఓ రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టినట్లు వివరించారు.

పవన్‌కు జాతీయ ఎక్సలెన్స్ అవార్డు



పవన్‌కుమార్‌కు విశాఖలో ఎక్సలెన్స్ అవార్డు అందజేస్తున్న సినీనటులు సుమన్, భానుచందర్

ఇబ్రహీంపట్నం: స్వచ్ఛంద సేవాసంస్థ నిర్వాహకుడు, న్యాయవాది వల్లభనేని నాగపవన్‌కుమార్‌ను జాతీయ స్థాయి ఎక్సలెన్స్ అవార్డు వరించింది. విశాఖపట్నంలో సిటిజన్ ఫోర్స్ స్వచ్ఛంద సంస్థ, ఫిలిం, టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో సినీనటులు సుమన్, భానుచందర్‌లు ఎక్సలెన్స్ అవార్డును అందజేశారు. దేశవ్యాప్తంగా 50 మందిని ఈ అవార్డుకు ఎంపికచేయగా, మన రాష్ట్రం నుంచి ఎంపికైన నలుగురిలో నాగపవన్‌కుమార్ ఒకరు. ఇబ్రహీంపట్నంకు చెందిన నాగపవన్‌కుమార్ 'మేమున్నాం' అనే స్వచ్ఛంద సేవాసంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కరోనా సమయం, వరద ప్రభావిత ప్రాంతాల్లో చేసిన సామాజిక సేవలకు గుర్తింపుగా అవార్డుకు ఎంపికచేశారు. విజయవాడ బార్ అసోసియేషన్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యుడిగా ఉన్న నాగపవన్‌కుమార్‌కు ఎక్సలెన్స్ అవార్డు దక్కడంతో పలువురు అడ్వకేట్లు, పుర ప్రముఖులు అభినందించారు.

స్కూల్ బస్సు డ్రైవర్‌పై ఎస్పీకి ఫిర్యాదు

నూజివీడు: పట్టణంలోని ఒక ప్రైవేటు స్కూల్ బస్సు డ్రైవర్‌పై సోమవారం జిల్లా ఎస్పీకి ఫిర్యాదు అందింది. బస్సులో పరిమితికి మించి పాఠశాల విద్యార్థులను ఎక్కించుకోవడమే కాకుండా నిర్లక్ష్యంగా బస్సు నడపడంపై ఈనెల 12న ప్రశ్నించినందుకు తనను దుర్భషలాడిన డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాని కోరుతూ తుక్కులూరుకు చెందిన పాలడుగు విజయ్‌కుమార్ ఎస్పీకి అర్జీని అందజేశారు. తుక్కులూరులోని తన ఇంటికి వచ్చి తనను దుర్భషలాడిన ప్రైవేటు స్కూల్ యజమానిపై కూడా చర్యలు తీసుకోవాలని అర్జీలో పేర్కొన్నారు. వీరిరువురిపై ఈనెల 15న నూజివీడు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఇంతవరకు వారిపై కేసు నమోదు చేయలేదని, ఇప్పటికైనా తనకు న్యాయం చేయాలని ఎస్పీని కోరాడు.

అధ్యాపకులు సద్వినియోగం చేసుకోవాలి

మైలవరం: హైబ్రిడ్ విధానంలో రెండు రోజులు ఆఫ్‌లైన్, ఐదు రోజులు ఆన్‌లైన్ విధానంలో జరిగే ఫ్యాకల్టీ అఫ్టేషన్ ప్రోగ్రామ్ సేవలు అధ్యాప కులంతా సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కే.అప్పారావు తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్యాకల్టీ అఫ్టేషన్ ప్రోగ్రామ్ జేఎన్‌టీయూకే కాకినాడ, ఎల్‌బీఆర్‌సీఈ సంయుక్తంగా సైబర్ సెక్యూరిటీ ఇన్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అనే అంశంపై సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఐఎస్ఈఏ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ కేవీ.రమణ మాట్లాడుతూ ఈ అంశం అత్యున్నత ప్రమాణాలతో కూడిన ప్రాజెక్టు అన్నారు. ఐఐటీల తరువాత మన తెలుగు రాష్ట్రాల్లో జేఎన్‌టీయూకే, కాకినాడకు ఈ ప్రాజెక్టు రావడం గర్వకారణమన్నారు. ఇది ఐదు సంవత్సరాల ప్రాజెక్టు ఎల్‌బీఆర్‌సీఈ కళాశాలతో కలిసి ఈ ఫ్యాకల్టీ ఉపదేశం ప్రోగ్రామ్ నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. అతిథి సాఫ్ట్వేర్, హైదరాబాద్ ప్రాజెక్టు మేనేజర్ శ్రీరామ్‌కుమార్ మాట్లాడుతూ బ్లాక్ చైన్ టెక్నాలజీని అధ్యాపకులు అర్థం చేసుకోవాలని సూచించారు. వక్తలుగా ఆన్‌లైన్ విధానంలో డాక్టర్ రాజేంద్ర పాములా, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఐఎస్ఎమ్ ధన్‌బాద్, డాక్టర్ రమేష్‌బాబు బాతుల, అసోసియేట్ ప్రొఫెసర్ ఎంఎన్ఐటీ, ఝార్ఖండ్, డాక్టర్ ఈ.సురేష్ బాబు, అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-1, ఎన్ఐటీ వరంగల్, డాక్టర్ ఎన్ విజయరాజ్ ప్రొఫెసర్ అండ్ హెచ్ఓడీ ఆఫ్ సీఎస్ఈ, వేల్టెక్, చెన్నై వ్యవహరించారు. ఐదు రోజుల ఫ్యాకల్టీ అఫ్టేషన్ ప్రోగ్రామ్‌కు జేఎన్‌టీయూకే, కాకినాడ రెక్టార్ డాక్టర్ కే.వీ రమణ, ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్‌గా వ్యవహరించనున్నారు. డాక్టర్ ఓ రమాదేవి, ప్రొఫెసర్, హెచ్ఓడీ, (ఏఐఅండ్ డీఎస్), డీఎస్, డాక్టర్ ఎస్.జయప్రద, ప్రొఫెసర్, హెచ్ఓడీ సీఎస్ఈ, ఏఐ అండ్ ఎమ్ఎల్, డాక్టర్ ఆదిశేషారెడ్డి,ప్రొఫెసర్, హెచ్ఓడీ(ఎమ్‌బీఏ) కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. కే విజయశ్రీబాయ్, సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ పర్యవేక్షించారు.

నెమలి ఆలయంలో ముగిసిన బ్రహ్మోత్సవాలు



నెమలి శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానంలో ద్వాదశ ప్రదక్షిణలు

తిరువూరు: నెమలి శ్రీ వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ నెల 12న ప్రారంభమైన బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం పలు రకాల పుష్పాలతో పుష్పయాగోత్సవం, ద్వాదశ ప్రదక్షిణలు, అద్దాల మండపంలో పవళింపు సేవ కార్యక్రమాలను ఆలయ అర్చకుడు గోపాలాచార్యులు ఆధ్వర్యంలో జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ సహాయ కమిషనర్ సంధ్య పర్యవేక్షించారు.

విజేతలకు బహుమతులు..

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎడ్ల బండ లాగుడు పోటీలో విజేతలకు బహుమతులు అందజేశారు. జూనియర్స్ విభాగంలో రామినేని శ్రీనివాసరావు(గార్లపాడు), కల్లం అనూషారెడ్డి (కల్లంవారిపాలెం), పొన్నం సాయిచరణ్ (గుమ్మడిదుర్రు), అన్వితా బుల్స్ (దుద్దుపూడి), గూడూరు సుధాకరరెడ్డి (గరికపాడు), కొండబోలు ఫణికుమార్ (వల్లభరావుపాలెం) విజేతలుగా నిలిచారు. సీనియర్స్ విభాగంలో గోగినేని జానసాయి (ఆవుదొడ్డి), కొక్కు మహేశ్వరరెడడ్డి (కడవకుదురు), అంగిరేకుల మోహన వెంకట మణికంఠ (ముత్తయపాలెం), పాలపర్తి మొగయ్య (పందిళ్ళపల్లి), గుంజి హేమంత్ (చీరాల), అయిలూరి బసవరెడ్డి (గన్నవరం) విజేతలుగా నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు.

మహిళల రక్షణ కోసమే శక్తి యాప్

ఆగిరిపల్లి: మహిళలకు, విద్యార్థినులకు శక్తి మొబైల్ యాప్‌తో భరోసా లభిస్తుందని ఎస్సై శుభశేఖర్ తెలిపారు. అడవినెక్కలం జిల్లా పరిషత్ హైస్కూల్లో సోమవారం విద్యార్థినులకు శక్తి మొబైల్ యాప్ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మహిళలు, బాలికల మొబైల్ ఫోన్‌లో శక్తి యాప్ ఉంటే ఆపద సమయాల్లో పోలీసులు సహాయం పొందువచ్చని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ కూలింగ్ కెనాల్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం పోలీసులకు సోమవారం లభ్యమైంది. నాలుగో స్టేజ్ గేటు వద్ద వ్యక్తి మృతదేహం ఉన్నట్లు గుర్తించిన సంస్థ అధికారులు పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించారు. ఎస్ఐ విజయలక్ష్మి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడికి సుమారు 40 ఏళ్ల వయస్సు ఉంటుందని, పసుపుకలర్‌పై బ్లాక్ కలర్ నిలువు అడ్డగీతలు కలిగిన షర్ట్ ధరించి ఉన్నాడని తెలిపారు. మృతదేహాన్ని గుర్తుపట్టినవారు పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ విజయలక్ష్మి కోరారు.

ఎస్సీ మహిళా సర్పంచ్‌ను దూషించిన వార్డు సభ్యులు

మైలవరం: మహిళా సర్పంచ్‌పై అగ్రవర్ణాల వార్డు సభ్యులు అసభ్యపదజాలంతో దూషించిన సంఘటన మైలవరం గ్రామ పంచాయతీ సాధారణ సమావేశంలో సోమవారం జరిగింది. దీనిపై మహిళా సర్పంచ్ జీ. మంజుభార్గవి సోమవారం రాత్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మైలవరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో వార్డు సభ్యుల సాధారణ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అగ్రవర్ణాలకు చెందిన కొంతమంది వార్డు సభ్యులు మహిళా సర్పంచ్ అని కూడా చూడకుండా అసభ్య పదజాలంతో దూషించారు. దీంతో మనస్థాపానికి గురైన సర్పంచ్ సమావేశం నుంచి బయటికి వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేసింది. గత పంచాయతీ ఎన్నికల సందర్భంగా మైలవరం గ్రామ సర్పంచ్ పదవిని ఎస్సీ మహిళలకు కేటాయించడంతో ఆమె వైఎస్సార్ సీపీ తరఫున సర్పంచ్‌గా పోటీ చేసి గెలిచింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సర్పంచ్ టీడీపీ తీర్థం స్వీకరించింది. వార్డు సభ్యులు కూడా ఒకరు జనసేన, మరొకరు టీడీపీలో చేరారు. అధికార పార్టీలో చేరిన సర్పంచ్‌కే అవమానాలు తప్పలేదు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.